# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 13 సెప్టెంబర్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 47

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## డీజిల్‌లో ఐసోబుటనాల్ మిశ్రమం

# రైతు సమస్యలు ప్రస్తావిస్తే కేసులా

**మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు**



హైదరాబాద్: రైతుల యూరియా కష్టాలను చూపిస్తే మీడియాపై కేసులు పెడతారా..? అణిచివేతలు, ఆంక్షలతో జర్నలిస్టులను భయపెడు తారా..? అని కాంగ్రెస్ సర్కార్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. రైతులు పడుతున్న యూరియా కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించిన ఖమ్మం రిపోర్టర్ సాంబశివరావుపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం అని మండిపడ్డారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన జర్నలిస్టుపై పోలీసులు ఉల్టా కేసులు పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం. గడిచిన 2 నెలలుగా రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతుంటే పట్టించుకోని ప్రభుత్వం.. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్న మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టడం శోచనీయం. శాంతిభద్రతల నిర్వహణను పక్కన పెట్టి ప్రజల గొంతు నొక్కేందుకు పోలీసులను వాడడం అప్రజాస్వామికం. జర్నలిస్ట్ సాంబశివ రావుపై పెట్టిన కేసులను తక్షణం ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, డీజీపీని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# ఓటు చోరీ కాదు..

## ఎమ్మెల్యేల చోరీపై మాట్లాడాలి



### రాహుల్‌కు కెటిఆర్ గట్టి సవాల్

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ద్వంద్వ ప్రమాణాలపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. పార్టీ మార్చిన ప్రతి ఒక్క ఎమ్మెల్యేను రాహుల్ గాంధీతో సహా అనేక మంది కాంగ్రెస్ నేతలు స్వయంగా కలిశారని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు తీసుకున్న ఫోటోలను సోషల్ మీడియాలో చూపించి ఇవ్వాళ వీళ్లను మీరు గుర్తుపట్టగలరా అని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ టికెట్ మీద గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలు, ఇప్పుడు మేము కాంగ్రెస్‌లో చేరలేదని అంటున్నారు..

ఇది ఎంత వరకు కరెక్ట్ అని కేటీ-ఆర్ ప్రశ్నించారు. అది కాంగ్రెస్ కండువా కాదు అని అంటు-న్నారు, మీరు దీన్ని ఒప్పుకుంటారా అని కేటీ-ఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. 'ఇది ఎమ్మెల్యేల చోరీ కాకపోతే ఇంకేమిటి?' అంటూ రాహుల్ గాంధీని నిలదీశారు. ఓటు- చోరీ గురించి రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలకంటే, ఎమ్మెల్యేల చోరీ కూడా చిన్న నేరం కాదని వ్యాఖ్యానించారు.



# హయ్యర్ ఇన్స్టిట్యూషన్స్ ప్రభుత్వంపై "తిరుగుబాటు".

- ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదల కోసం డిమాండ్.
- ఈనెల 15న "బ్లాక్ డే"గా పాటించాలని పిలుపు.
- ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కాలేజీల నిరవధిక మూసివేతకు సిద్ధం.



2లో



# దక్షిణ భారత కుంభమేళాగా గోదావరి పుష్కరాలు

**గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు**

**తీరప్రాంత ఆలయాల అభివృద్ధికి తక్షణ చర్యలు**

**పుష్కరాలపై సమీక్షించిన సెం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్: గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు- చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు- చేయాలన్నారు. అందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే, రాష్ట్రంలో గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దీంతో పాటు- పుష్కరాల ఏర్పాట్లు-, రాబోయే భక్తుల రద్దీని అంచనా వేసుకొని మౌలిక వసతులు కల్పించాలన్నారు.

గోదావరి పుష్కరాల ఏర్పాట్లు-, ముందస్తు సన్నద్ధతపై శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు- మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్ నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆలయాల వద్ద శాశ్వత ఘాట్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే సారి రెండు లక్షల మంది స్నానాలు చేసేందుకు వీలుగా ఘాట్లు ఉండాలని సూచించారు.



2లో

# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

**రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన ద్రౌపది ముర్ము హాజరైన ప్రధాని మోడీ, పలువురు ప్రముఖులు ప్రమాణం**

# నేడు మణిపుర్‌లో మోదీ పర్యటన

**జాతుల ఘర్షణ తర్వాత ఇదే తొలిసారి**

**రూ.8,500 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**



ఇంఫాల్: మణిపుర్‌లో జాతుల మధ్య హింస చెలరేగిన రెండు సంవత్సరాల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి ఆ రాష్ట్రంలో శనివారం పర్యటించనున్నారు. శాంతి, అభివృద్ధి కార్యక్రమాలను నెలకొల్పడానికి రూ.8,500 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేయనున్నారు. మోదీ పర్యటన దృష్ట్యా మణిపుర్ ప్రభుత్వం భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పునీత్ కుమార్ గోయెల్ విలేకరులతో మాట్లాడుతూ.. 'ప్రధాని మోదీ మిజోరం నుంచి చురాచంద్‌పుర్ చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు ఘర్షణల్లో నిరాశ్రయులైనవారిని కలుసుకుంటారు. ఆ తర్వాత చురాచాంద్‌పుర్‌లో రూ.7,300 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే ఇంఫాల్‌లో రూ.1,200 కోట్లకు పైగా ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. ఈ నెల 13-15 మధ్య మోదీ మిజోరం, మణిపుర్, అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్‌లలో పర్యటిస్తారు' అని ఆయన తెలిపారు.



# సుప్రీంకోర్టు ఆవరణలో నిషేధాజ్ఞలు

**రీల్స్ తదితర కార్యకలాపాల నిషేధం**

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రాంగణంలోని హై సెక్యూరిటీ జోన్‌లో ఫొటోలు, రీల్స్ చేయడం, వీడియోలు తీయడంపై సర్వోన్నత న్యాయస్థానం నిషేధం విధిస్తూ సర్క్యులర్ జారీ చేసింది. సెప్టెంబరు 10న జారీచేసిన ప్రకటనలో మీడియా సిబ్బంది ఇంటర్వ్యూలు, వార్తలకు సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాలను కేవలం భద్రతా ప్రమాణాలకు అనుగుణమైన జోన్‌లో మాత్రమే నిర్వహించాలని సుప్రీంకోర్టు పేర్కొంది.

# పూర్తి కావస్తున్న బతుకమ్మ కుంట పనులు

**ఈసారి అక్కడే బతుకమ్మ ఉత్సవాలకు ప్లాన్**

**యాకుతుపురా ఘటనపై బాధ్యులపై చర్యలు**

**హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ**



2లో

# సింగరేణికి కొత్త బ్లాక్‌లు దక్కడం లేదు

**ఖనిజాల తవ్వకాల్లోనూ సింగరేణికి ప్రాధాన్యం ఇవ్వాలి**

**గ్రీన్ ఎనర్జీ స్టోరేజ్‌లో భాగస్వామ్యం అవుతున్న సింగరేణి**

**మీడియా సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి**



హైదరాబాద్: సింగరేణి సంస్థ కేవలం బొగ్గు గనులకే పరిమితం కాకుండా ఖనిజాల తవ్వకాల్లోనూ పాల్గొనాలని సింగరేణి బోర్డు నిర్ణయం తీసుకుందని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. తద్వారా సింగరేణి సంస్థకు నష్టం జరుగుతుందని అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. సింగరేణి బోర్డు బొగ్గు తవ్వకాలు పెంచడంతోపాటు ఇతర మినరల్స్ మైనింగ్ చేయాలని నిర్ణయం తీసుకుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాయచూరు, దేవదుర్గ ప్రాంతాల్లో కాపర్ అండ్ గోల్డ్ మైనింగ్ యాక్షన్‌లో సింగరేణి పాల్గొందని గుర్తు చేశారు. దాని వల్ల సింగరేణి 37.75శాతం వాటాను దక్కించుకుందని హర్షం వ్యక్తం చేశారు. పలు రాష్ట్రాల్లోని ఎన్టీపీసీలకు సింగరేణి బొగ్గు సరఫరా చేస్తోందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మరో 25 ఏళ్లకు సరిపడా మాత్రమే బొగ్గు నిల్వలు ఉన్నాయని చెప్పారు. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాక్‌లు ప్రైవేటు- వ్యక్తులకు వెళ్తాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లు ఇప్పటికే ప్రైవేటు- వ్యక్తులకు వెళ్లాయని గుర్తు చేశారు. అందుకే సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనాలని సూచించారు. దాంతో సింగరేణిలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని వివరించారు. సింగరేణి గ్రీన్ ఎనర్జీ స్టోరేజ్‌లో భాగస్వామ్యం అవుతోందని పేర్కొన్నారు. దేశానికి క్రిటికల్ మినరల్స్ అందించడంలో భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో సింగరేణి ముందుకు వెళ్తుందని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. కీలక ఖనిజాల వెలికితీతలో కూడా కేంద్రం సింగరేణి సంస్థకు అవకాశం కల్పించాలని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాయచూర్, దేవదుర్గ్ బెల్ట్ లో రాగి, బంగారం ఖనిజాల అన్వేషణలో, కర్ణాటకలో రాగి, బంగారం, మైనింగ్ గనుల తవ్వకాల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొన్నదని భట్టి తెలియజేశారు. కీలక ఖనిజాల తవ్వకాల కోసం సింగరేణి గ్లోబల్ అనే పేరుతో వెళుతుందని, దేశంలో జరుగుతున్న బొగ్గు గనుల వేలంతో కొన్నాళ్లుగా సింగరేణి పాల్గొనడం లేదని చెప్పారు. సింగరేణి సంస్థ వేలంలో ఎందుకు పాల్గొనడం లేదో తాము పరిశీలించామని అన్నారు. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాక్ లు ప్రైవేటు- వ్యక్తులకు వెళ్తాయని, సింగరేణి సంస్థకు అదనంగా రావాల్సిన బొగ్గు బ్లాక్ లు దక్కడం లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. కొత్త బ్లాక్ లు కేటాయించకపోవడంతో సింగరేణి సంస్థ ఇబ్బందులు ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బ్లాక్ లు దక్కని పరిస్థితి వస్తోందని, కొత్త బ్లాక్ లు రాకుంటే సింగరేణి మూసి వేయాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. సింగరేణికి కొత్త బ్లాక్ లు రాకపోవడంతో ఆ సంస్థతో పాటు- రాష్ట్రానికి నష్టం అని హెచ్చరించారు.

# బీసీల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ కు లేదు.

**- 42% రిజర్వేషన్లు ఆ పార్టీకి ఇష్టం లేదు.మంత్రి సీతక్క**



కామారెడ్డి: బీసీల గురించి మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్ పార్టీకి లేదని మంత్రి సీతక్క అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఆ పార్టీకి ఇష్టం లేదని ఆరోపించారు. కామారెడ్డిలో సీతక్క శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, కేంద్రంపై ఒత్తిడి చేయాల్సిన బీఆర్ఎస్ నాయకులు.. ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు కేంద్రంపై ఒత్తిడి చేయకపోగా సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. ఈ విషయంలో తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందన్నారు. రిజర్వేషన్లకు సంబంధించి ప్రతి అడుగు రాష్ట్రంలో పూర్తి చేసినట్లు చెప్పారు. దీనిని ఆమో దించని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. 10 ఏండ్లలో ఉద్యోగాల భర్తీకి బీఆర్ఎస్ నోటిఫికేషన్లు ఇవ్వలేదని, ఇచ్చినా ఉద్యోగాలను భర్తీ చేయలేదన్నారు. గత ప్రభుత్వం గ్రూప్ 1 విషయంలో ఫెయిల్ అయ్యిందన్నారు. తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా లోపాలు లేకుండా పని చేస్తున్నట్లు తెలిపారు.

**అభివృద్ధి కోసమే పార్టీలో చేరింద్రు**

2014, 2018 ఎన్నికల తర్వాత ఆయా పార్టీల నుంచి ఎమ్మెల్యేలను, ఇతర ప్రజా ప్రతినిధులను బీఆర్ఎస్ తమ పార్టీలో చేర్చుకుందన్న మంత్రి సీతక్క ఇప్పుడు కొందరు అభివృద్ధి కోసం వచ్చి కలిశారని చెప్పారు. డీఎన్ఎ గురించి మాట్లాడే ముందు గతంలో చేరిన వాళ్ల గురించి కేటీఆర్ మాట్లాడాలని డిమాండ్ చేశారు.

# హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రభుత్వంపై “తిరుగుబాటు”.





**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:**

ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్స్టిట్యూషన్స్(ఫతి) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇంజనీరింగ్, ఫార్మా, ఎంబీఏ, బీఇడీ, పీజీ, డిగ్రీ కాలేజీలకు తదితర ఉన్నత విద్యా సంస్థలకు ప్రభుత్వం నుంచి సుమారు 1200 కోట్ల రూపాయలు రావలసి ఉంది. బకాయిలను చాలా కాలంగా విడుదల చేయని కారణంగా కాలేజీల యాజమాన్యాలు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు దృష్టికి తెచ్చారు. సచివాలయంలో శుక్రవారం రామకృష్ణారావుకు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఫతి ఛైర్మన్ డాక్టర్ ఎన్.రమేష్ బాబు మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. తమకు రావలసిన బకాయిలను విడుదల చేయాల్సిందిగా పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన కానరాకపోవడం తీవ్ర విచారకరమని రమేష్ చెప్పారు. చాలా కాలంగా బకాయిలు విడుదల కానందున సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, కాలేజీలను నడిపించ లేక నానా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. కాలేజీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 15వతేదీన “బ్లాక్ డే”గా పాటించాలని, అప్పటి నుంచి నిరవధికంగా మూసివేయాలని నిర్ణయించినట్లు రమేష్ తెలిపారు. కాలేజీలు ఈ విధమైన నిర్ణయం తీసుకుని ఆందోళన బాట పట్టడం దేశంలోనే తొలిసారి అని ఆయన వివరించారు. విలేకరుల సమావేశంలో ఫతి డాక్టర్ కే.ఏస్.సెక్రటరీ జనరల్ రవికుమార్, కోశాధికారి కే. కృష్ణారావు, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాటం సునీల్ కుమార్, రాందాస్, ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపరితల ఆవర్తనంతో బంగాళాఖాతంలో అల్పపీడనం

**తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం**

**మానేరు వాగులో చిక్కుకు పోయిన ట్రాక్టర్లు**

**హైదరాబాద్ మూసీకి వరదపోటు**



హైదరాబాద్: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న రెండురోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. ఆదివారం వరకు మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఇవాళ ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. శనివారం నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. వర్షాల ప్రభావంతో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే వీలుందని తెలిపింది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వర్షాలు దంచి కొడుతున్నాయి. భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో మానేరు వాగుకు ఇంతకింతకూ పెరుగుతూ భయంకరంగా ప్రవహిస్తోంది. శుక్రవారం ఉదయం ఇసుక కోసం వెళ్లిన ట్రాక్టర్లు మానేరు వరదలో చిక్కుకున్నాయి. ఎనిమిది ట్రాక్టర్లు వరదల్లో చిక్కుకోవడంతో భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి- ఒడేడ్ గ్రామాల మధ్య గల మానేరు వాగులోకి ఇసుకకోసం వెళ్లిన 8 ట్రాక్టర్లు వరదలో చిక్కుకున్నాయి. మొదట అంతగా వరద లేకపోవడంతో ఇసుకను తవ్వుతూ ఉన్నారు. ఉన్నట్లుండి ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగటంతో ట్రాక్టర్లను అక్కడే వదిలేసి డ్రైవర్లు, కూలీలు వెంటనే బయటకు పరుగెత్తారు. ప్రవాహం పెరుగుతుండటంతో పరిస్థితి భయంకరంగా తయారైంది. వరద ఉధృతికి ట్రాక్టర్లు ఒరిగి పోయిన దృశ్యాలు ఆంతోళన కలిగిస్తున్నాయి. అయితే ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు పోలీసులు. వెంటనే అక్కడికి చేరుకుని సిబ్బందితో కలిసి సహాయక చర్యలు స్థానిక పోలీసులు చేపట్టారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద పోటెత్తడంతో ఉస్మాన్ సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో జలమండలి అధికారులు గండిపేట జలాశయం ఆరు గేట్లను నాలుగు అడుగుల మేర పైకి ఎత్తి 2652 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న మూసీలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలోకి 2000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు. మరోవైపు గేట్లు- ఎత్తడంతో మూసీలో వరద ఉధృతి మరింత పెరిగింది. నార్సింగి, మంచిరేవుల మధ్య ఉన్న కల్వర్టు పైనుంచి ఈ వరద నీరు ప్రవహించడంతో అధికారులు ఇరువైపులా రాకపోకలను నిలిపివేశారు. మూసీలో వరద ప్రవాహం అధికంగా ఉండటంతో మున్సిపల్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు లోతట్టు- ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ పరిధిలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. న్యాళ చెరువు, ఆకునూరు ఊర చెరువు సహా పలు కుంటలు వరదనీటితో నిండిపోయాయి. దీంతో పలు గ్రామాల్లో పంటపొలాలు నీటమునిగాయి. సోమారంలో ఆదర్శ పాఠశాల పరిసరాలు జలమయమయ్యాయి. అక్కడి వసతి గృహం చుట్టూ మోకాలి లోతు నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని బొమ్మకల్ వద్ద కల్వర్టుపై వరద ఉధృతి అధికంగా ఉండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెనుకేపల్లి తుమ్మలచెరువు మత్తడి పడుతుండడంతో అటు-వైపు రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటు-న్నారు. మరో మూడు రోజుల పాటు- భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైదాపూర్ తహశీల్దార్ శ్రీనివాస్, ఎస్సై తిరుపతి కోరారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం రాత్రి సైదాపూర్‌లో 102 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు- అధికారులు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో కురిసిన భారీ వర్షానికి వాగులు, కుంటలు పొంగి ప్రవాహిస్తున్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని ఇందిరాసాగర్ నిండుకుండలా మారి అలుగు పోస్తోంది. మజీద్‌పూర్, గుంతపల్లి గ్రామాల మధ్య ఏరులో వరద నీరు ఉరకలేస్తోంది. కల్వర్టు మీదుగా వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

**రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన ద్రౌపది ముర్ము**

**హాజరైన ప్రధాని మోడీ, పలువురు ప్రముఖులు**



న్యూఢిల్లీ: భారత నూతన ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు–, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులు, మాజీ ఉప రాష్ట్రపతులనూ ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యానాయుడు, హమీద్ అన్సారీ తదితరులు కూడా హాజరయ్యారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, పియూష్ గోయెల్, ధర్మేంద్ర ప్రదాన్ సహా పలువురు కేంద్ర మంత్రులు, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఎన్డీయే కూటమికి చెందిన నేతలు, ఎంపీలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఈనెల 9న జరిగిన పోలింగ్‌లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ తన సమీప ప్రత్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నిక లాంఛనాలన్నీ పూర్తి కావడంతో గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేశారు. దీంతో మహారాష్ట్ర బాధ్యతలను గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు రాష్ట్రపతి ముర్ము అప్పగించారు. ఆర్‌ఎస్‌ఎస్, జన్‌సంఘ్ లాంటి సంస్థలతో 16 ఏండ్లకే రాధాకృష్ణన్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1996లో తమిళనాడు బీజేపీ కార్యదర్శిగా, 2003 నుంచి 2006 మధ్య అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన రాష్ట్రంలో 93 రోజుల పాటు 19 వేల కి.మీ రథయాత్ర నిర్వహించారు. 2024, జూలై 31న ఆయన మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జార్ఖండ్ గవర్నర్‌గా ఏడాదిన్నర పాటు చేశారు. తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ పనిచేశారు. 1998, 1999లో కోయంబత్తూర్ నుంచి ఆయన రెండుసార్లు ఎంపీగా చేశారు. అభిమానులు ఆయనను తమిళనాడు మోదీగా పిలుస్తారు.

# రానున్న దశాబ్దకాలంలో మారనున్నరూపురేఖలు




అమరావతి:భారతదేశానికి నాలుగోసారి ప్రధానిగా నరేంద్రమోదీనే ఉంటారని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. వచ్చే దశాబ్దంలో ఏపీతోపాటు, దేశంలో అద్భుతాలు జరుగు తాయని ఆయన అన్నారు. ఒక సీఎంగా భావితరాల కోసం ఆలోచన చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిలో నిర్వహించిన ఓ ప్రైవేట్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో ఏపీ రూపురేఖలు ఎలా ఉండబోతున్నాయనే అంశాన్ని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. 1994లో చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నా. 1999లో గెలిచా. 1999 ప్రభుత్వం వచ్చాక ఓ తపనతో పని చేశా. కొంచెం బ్యాలెన్స్ చేయలేకపోయాం. కానీ ఇప్పుడు పూర్తి బ్యాలెన్స్ చేస్తున్నాం. సంపద సృష్టిస్తున్నాం.. పేదలకు అందిస్తున్నాం. భారత ప్రధానిగా నాలుగోసారి కూడా మోదీనే వస్తారు. రాష్ట్రంలో కూడా ఎన్డీఏ ప్రభుత్వమే వస్తుంది. ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు అని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఏపీలోని స్టేక్ హోల్డర్లను భాగస్వాములను చేస్తూ ఈ తరహా కాంక్లేవ్ నిర్వహించడం మంచి పరిణామం అని సీఎం చంద్రబాబు అన్నారు. విజన్ రూపకల్పన చేయడమే కాదు.. దాన్ని సాధ్యం చేసే దిశగా పని చేయాలని ఆయన సూచించారు. జాతీయ స్థాయిలో వికసిత్ భారత్-2047, రాష్ట్ర స్థాయిలో స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్లను సిద్ధం చేశామని తెలిపారు. భారతీయులకు సరైన గుర్తింపు లేని సమయంలో తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి భారతదేశం అభివృద్ధి అన్ స్టాపబుల్ గా మారింది. 2038 నాటికి భారతదేశం నెంబర్-1 అవుతుంది. ఇందులో తెలుగు వారి పాత్ర ప్రధానంగా ఉండాలని భావిస్తున్నానని అన్నారు.

# మెడికల్ కాలేజీలు కట్టకుండానే ప్రచారం



అమరావతి:జగన్ మెడికల్ కాలేజీలు కట్టకుండా... కట్టేశామని చెబుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎద్దేవా చేశారు. తాము ప్రైవేట్ వారికి అప్పగించడం లేదని .. పీపీపీ పద్ధతిలోనే చేపడుతున్నామన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని, నిర్వహణ ప్రభుత్వానిదేనని తేల్చి చెప్పారు. వైద్య విద్యార్థులకు, వైద్య సేవలకు ఇబ్బంది రాకుండా చేసే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. బెదిరిస్తే బెదిరిపోయే పరిస్థితి లేదని తెలిపారు. ఒకప్పుడు రాయలసీమలో పదేళ్లలో 8 ఏళ్లు కరవు ఉండేదన్నారు. దేశంలో ఇప్పటికీ అతి తక్కువ వర్షపాతం ఉన్న జిల్లా అనంతపురం.. కానీ నీళ్లు ఇవ్వడంతో అక్కడ పరిస్థితి మారిందన్నారు. గోదావరి జిల్లాల కంటే అనంతపురం జిల్లానే జీఎస్‌డీపీలో అగ్రస్థానంలో ఉందన్నారు. హార్టీకల్చర్ సాగు వల్లే ఇది సాధ్యమైందని గుర్తు చేశారు. వృథా జలాలను మాత్రమే బనకచర్లకు


వినియోగించుకుంటామని స్పష్టం చేశారు. ఇదిలావుంటే గతంలో జగన్ శంకుస్థాపన చేసిన వైద్య కళాశాలలన్నీ పునాదుల దశలోనే ఉన్నాయని, మొండి గోడల మధ్య వైద్య విద్యార్థులు చదువుకుంటారా? అని ఏపీ హోం మంత్రి అనిత మండిపడ్డారు. పునాదుల దశలోనే వైద్య కళాశాలలు ఉంటే.. అడ్మిషన్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. విజయవాడలో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో.. మెడికల్ కాలేజీలపై వైకాపా నేతలు చేస్తున్న విమర్శలకు ఆమె కౌంటర్ ఇచ్చారు. వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత వైకాపా ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని విమర్శించారు. నోటికొచ్చినట్లు- జగన్ అబద్ధాలు చెబుతున్నారు. వైద్య కళాశాలల నిర్మాణానికి రూ.5,800 కోట్లు- అవసరం. కానీ, ఐదేళ్లలో జగన్ ఖర్చు చేసింది కేవలం రూ.1,450 కోట్లే. పీపీపీ విధానం అంటే జగన్ ఎందుకు భయపడుతున్నారో అర్థం కావట్లేదు. ఈ విధానంలో వైద్య కళాశాలలు నిర్మించి, మౌలికవసతులు కల్పిస్తారు. నిర్వహణ మొత్తం ప్రభుత్వమే చేపడుతుంది. కళాశాలలు తొందరగా నిర్మించాలనే ఉద్దేశంతోనే ఈ విధానం తీసుకొచ్చాం అన్నారు. జగన్ చేసిన పాపం వల్ల.. వైద్య విద్య అడ్మిషన్లు తీసుకురాలేక పోయాం. పీపీపీ విధానంలో టెండర్లు వేసేందుకు ముందుకొస్తే జగన్ బెదిరిస్తున్నారు. అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మళ్లీ అధికారం లోకి వస్తామని జగన్ పగటి కలలు కంటున్నారు. ఆహా అంటున్న వైద్య కళాశాలలు ఎక్కడున్నాయో చెబితే.. జగన్‌ను నేనే అక్కడికి తీసుకెళ్తా. ఆయన ఆహా అంటారో.. ఓహో అంటారో చూద్దామని అనిత అన్నారు. వైకాపా హయాంలో ఐదేళ్లలో వైద్యకళాశాల భవన నిర్మాణాలను పూర్తిచేయకుండా జగన్ నిద్రపోయారని మంత్రి సత్యకుమార్ విమర్శించారు. వైకాపా నేతలు ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వైద్యకళాశాలలకు భవనాలు నిర్మించక పోవడంతో వేలాది మెడికల్ సీట్లను విద్యార్థులు కోల్పోయారని చెప్పారు. లక్షలాది మందికి వైద్యం అందలేదని ఆక్షేపించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియాలో వైకాపా అసత్య ప్రచారాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీల నిర్మాణ టెండర్లు రద్దు చేస్తానని జగన్ ప్రకటించడం దారుణమని.. అలా రద్దు చేయడం ఎవరి తరమూ కాదన్నారు.

# పూర్తి కావస్తున్న బతుకమ్మ కుంట పనులు



హైదరాబాద్: బతుకమ్మ కుంట పనులు పూర్తి కావొస్తున్నాయని, త్వరలో సీఎం ఆధ్వర్యంలో బతుకమ్మ కుంట ప్రారంభిస్తాం అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నార . ఈసారి బతుకమ్మ పండుగ అక్కడే నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం అని కమిషనర్ తెలిపారు.సున్నం చెరువులో పనులు ఆపమని కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ రాలేదన్నారు. ఇకపోతే యాకుత్‌పురాలో ఐదేళ్ల బాలిక పాఠశాలకు వెళ్తూ ప్రమాదవశాత్తూ మ్యాన్ హోల్‌లో పడిపోయిన ఘటనపై హైడ్రా స్పందించింది. అయితే ఘటనపై వెంటనే గమనించిన బాలిక నాయనమ్మ, స్థానికులు సురక్షితంగా కాపాడారు. హైడ్రా సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఘటనపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. యాకుత్‌పురా ఘటనపై రాజకీయపరంగా చేసే విమర్శలపై స్పందించను. భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటాం అన్నారు. హైడ్రా వల్లే తప్పు జరిగిందని గుర్తించామని, ఘటనకు బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలో ఉన్న మ్యాన్‌హోల్స్‌పై ఆడిట్ చేస్తున్నాం. మూతలు సరిగాలేనివి గుర్తించి.. సంబంధిత ఏజెన్సీకి సెక్రటరీ ద్వారా రిఫర్ చేస్తాం. జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, హైడ్రా మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేదు. బ్లేమ్ గేమ్ కాకుండా సమన్వయంతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ ఇన్‌ఛార్జి ఈ ఘటనకు బాధ్యుడు.. అతనిపై చర్యలు తీసుకుంటాం. ఆ చుట్టుపక్కల నాలుగైదు మ్యాన్ హోల్స్ ఉన్నాయి.. అందులో ఒకటి వాటర్ బోర్డు వాళ్లు క్లీన్ చేశారు. ఘటన జరిగిన మ్యాన్ హోల్ మాత్రం హైడ్రా సిబ్బంది క్లీన్ చేశారు. మంచి చేస్తేనే మా ఖాతాలో వేసుకోవడం కాదు.. తప్పు జరిగినప్పుడు కూడా అంగీకరిస్తున్నాం. ఇతర శాఖలతో చిన్న చిన్న సమస్యలు తప్ప పెద్ద ఇబ్బందులు లేవు. జీహెచ్ఎంసీ పెద్ద ఆర్గనైజేషన్.. మేము ఎవరిపై పెత్తనం చెలాయించట్లేదు. మా అందరికీ బాస్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉన్నారు. మా శాంక్షన్ అయిన బడ్జెట్‌లో 3 నెలలది మాత్రమే రిలీజ్ అయింది. హైడ్రా పోలీస్ స్టేషన్‌లో త్వరలో కేసులు నమోదు చేస్తాం.

# డీజిల్‌లో ఐసోబుటనాల్ మిశ్రమం



న్యూఢిల్లీ: దేశంలో ఇంధన దిగుమతుల ఖర్చును తగ్గించేందుకు ఇథనాల్ కలుపుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇ20 పెట్రోల్ వాడకం గురించి వాహనదారుల్లో ఉన్న అపోహలపై కేంద్రం క్లారిటీ- ఇచ్చింది. అయితే తాజాగా ఇథనాల్‌కు బదులుగా ఐసోబుటనాల్‌ను డీజిల్‌లో కలపనున్నట్లు- కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. డీజిల్‌లో ఇథనాల్‌ను కలిపే ప్రయోగం విజయవంతం కాలేదని.. అందువల్ల దానికి బదులుగా ఐసోబుటనాల్ మెరుగైనది గుర్తించినట్లు- చెప్పారు. డీజిల్‌లో ఇథనాల్ మిక్స్ చేసినప్పుడు ఇంజిన్ సమస్యలతో పాటు- కొన్ని సాంకేతిక సమస్యలు వచ్చాయని చెప్పారు. బయోఫ్యూయల్ మిక్సింగ్ విదేశీ కరెన్సీని ఆదాచేయటంతో పాటు- భారీ ఫ్యూయెల్ బిల్లుల నుంచి ఉపశమనం కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. పెట్రోల్ లో ఇథనాల్ మిక్సింగ్ పై సోషల్ మీడియాలో తనపై కావాలనే తప్పుడు ప్రచారం కొనసాగించాలని గడ్కరీ ఇటీవల అన్నారు. అవి పూర్తిగా పెట్రోల్ లాబీ స్పాన్సర్ చేసిన పెయిడ్ ప్రచారం అన్నారు గడ్కరీ. ఊ20 ఇంధనానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారం రాజకీయంగా ప్రేరేపించబడిందని అన్నారు. ఇథనాల్ వల్ల వాహనాల ఇంజన్లు పాడవుతాయనం పూర్తిగా నిరాధారమైనదిగా కొట్టిపడేశారు. కానీ కొందరు నిపుణులు మాత్రం ఇథనాల్ వల్ల పాత వాహనాల్లో ఇంజిన్లో తుప్పు, రబ్బర్ భాగాలు పడవటం జరుగుతుందని అంటున్నారు. మైలేజ్ కూడా దెబ్బతింటు-ందని చెబుతున్నారు. ప్రస్తుతం డీజిల్ విషయంలో ఐసోబుటనాల్ కలపాలనుకోవటానికి కారణం అందులో ఇథనాల్ కంటే ఎక్కువ ఎనర్జీ ఉండటమే. డీజిల్‌లో కలిపినప్పుడు ఇంజిన్ పనితీరు మెరుగుపడి కాలుష్యం కూడా తగ్గినట్లు- గుర్తించారు. ఇథనాల్ మాదిరిగానే ఐసోబుటనాల్ కూడా చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి తయారు చేస్తారు. ఇక్కడ అసలు సమస్య ఏంటంటే ఐసోబుటనాల్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడమే. దీని శుద్ధికి కర్మాగారాలకు నూ టెక్నాలజీ అవసరం ఉందని తెలుస్తోంది.

# వ్యర్థాలను డిస్పోస్ చేయని ఆసుపత్రులపై చర్యలు.





**అధికారులను ఆదేశించిన కలెక్టర్.**

**పడకల్ శివారులో మెడికల్ వేస్టేజీని నిర్వీర్యం చేసే ప్లాంట్ పరిశీలన.**

**సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ తనిఖీ.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 12**

ఆసుపత్రుల వ్యర్థాలను నిబంధనలకు అనుగుణంగా సరైన విధానంలో డిస్పోస్ చేయని హాస్పిటల్స్ పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. జక్రాన్ పల్లి మండలం పడకల్ గ్రామ శివారులో శ్రీ మెడికేర్ సర్వీసెస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ వేస్టేజీని నిర్వీర్యం చేసే ప్లాంట్ ను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ప్రతి రోజు ఎన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల నుండి వ్యర్థాలను సేకరిస్తున్నారు, వాటిని ఎలా నిర్వీర్యం చేస్తున్నారు అని వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులను తనిఖీ చేశారు. జిల్లాలో 900 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కొనసాగుతుండగా, సగానికి పైగా ఆసుపత్రుల నుండి వ్యర్థాలను సేకరించడం లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రుల వ్యర్థాలను హాస్పిటల్స్ నుండి ఏజెన్సీ వారు ప్రతిరోజూ సేకరిస్తూ ఈ ప్లాంట్ లో నిర్వీర్యం చేయాల్సి ఉండగా, ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో ఎందుకు నిర్వహించడం లేదని నిలదీశారు. మెడికల్ వేస్టేజీని పక్కాగా సేకరించని కారణంగా ప్రైవేట్ ఆసుపత్రులకు చెందిన అనేక మంది వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేస్తున్నారని, ఇది ప్రజల ఆరోగ్యాలకు ప్రమాదకరంగా పరిణమిస్తుందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ ఏజెన్సీకి వ్యర్థాలు అందించని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేయాలని, అయినప్పటికీ మెడికల్ వేస్టేజీ విషయంలో నిబంధనలు అమలు చేయకపోతే అలాంటి ఆసుపత్రుల అనుమతులను రద్దు చేయాలని కలెక్టర్ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. అదేవిధంగా ఒప్పంద సేవలు కలిగి ఉన్న జిల్లాలోని అన్ని ఆసుపత్రుల నుండి వ్యర్థాలను కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతిరోజు సేకరించేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని, ఒకవేళ వ్యర్థాల సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవరిస్తే ఏజెన్సీని రద్దు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యర్థాలను నిర్వీర్యం చేసే పనులలో పాల్గొంటున్న సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, వారు అనారోగ్యాల బారిన పడకుండా తగిన టీకాలు ఇప్పించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఏజెన్సీ పనితీరును క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరపాలని కాలుష్య నియంత్రణ మండలి ఏ.ఈ మానసను ఆదేశించారు.

**సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ తనిఖీ చేసిన కలెక్టర్**

కాగా, నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గంగాస్తాన్ ఫేజ్-1 లో గల సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ (సి.డీ.ఎస్)ను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సి.డీ.ఎస్ లో రికార్డులలో పొందుపరచిన దానికి అనుగుణంగానే ఔషధ నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఔషధాలను ఎక్కడి నుండి సమకూరుస్తారు, సి.డీ.ఎస్ ద్వారా వివిధ పీ.హెచ్.సిలకు వాటిని ఎలా చేరవేస్తారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇండెంట్ వచ్చిన వెంటనే తాత్సారం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఔషధాలు పంపించాలని, ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలె ప్రమాదం ఉన్నందున అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఫార్మసిస్ట్ గంగాధర్ ను ఆదేశించారు.

# 16న మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 12**

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఈ నెల 16న ఉదయం 10.30 గంటలకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం జరగనుందని డీఆర్డీఓ సాయాగౌడ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులచే వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దిశ సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

# మోపాల్ మోటాడి రెడ్డి నూతన కార్యవర్గం ఎన్నిక.



**వేగుచుక్క న్యూస్:**

మోపాల్ మండల మోటాడి రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం జరుగగా, కమిటీని ఏకగ్రీవముగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడి గా గుడి ప్రవీణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహేష్ రెడ్డి, కోశాధికారిగా రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా నర్సారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గంగారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గంగారెడ్డి, చిన్నారెడ్డి, సంతోష్ రెడ్డి తదితరులను ఎన్నుకొన్నారు. ఈ కార్యవర్గం రెండు సంవత్సరాలు కొనసాగుతుందని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

# యూరియా కొరతకు కేంద్రమే కారణం.

## - మంత్రి వాకటి శ్రీహరి ఆరోపణ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, సెప్టెంబర్ 12:**

తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వ కారణమని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ క్రీడలు, యువజన సర్వీసెస్ శాఖ మంత్రి వాకటి శ్రీహరి అన్నారు. నగరంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్రమంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడారు. రాష్ట్రానికి సరిపడంత యూరియా పంపకుండా కేంద్రం ద్రోహం చేస్తుందని, దీంతో తెలంగాణ రాష్ట్ర రైతుల అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ వర్షాకాలంలో పంటలు ఎక్కువగా పండిస్తున్న తరుణంలో యూరియా ఎక్కువ అవసరం ఉన్నందున కొంత ఇబ్బంది కలిగినప్పటికీ, రైతులు కొంతమంది స్టాక్ ఉంచుకోవడంతో ఇతర రైతులకు దొరకడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని సిఎం రేవంత్ రెడ్డి కలిసి ప్రతి సంక్షేమ పథకాలపై, నిధులపై, యూరియా సరఫరా పై మాట్లాడడం జరిగిందని అన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ కట్టుబడి ఉంది.

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ కట్టుబడిందని కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకటి శ్రీహరి అన్నారు. బీసీలు బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. బిసి రిజర్వేషన్ బిల్లుకు ఇంకా గవర్నర్ ఆమోదం తెలుపలేదని, దీనిపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం పై ఒత్తిడి చేస్తున్నట్లు మంత్రి శ్రీహరి తెలిపారు. జనాభా ప్రతిపాదన ప్రకారం రిజర్వేషన్ ఉండాలనేది రాహుల్ గాంధీ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రిజర్వేషన్ సాధించిన తర్వాతే సంస్థాగత ఎన్నికలకు వెళ్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్ర గవర్నర్ కు పంపించమని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి, బీసీలను రాజకీయంగా ఎదిగే విధంగా అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ మీడియా సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్, భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు, డైరీ ఫాం కార్పొరేషన్ చైర్మన్ అమిత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, ఏఎంసీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి, పిసిసి డెలికేట్ శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ వర్శిటీ డిగ్రీ, పీ.జీ ప్రవేశ గడువు పెంపు.

## రిజిస్ట్రేషన్, ట్యూషన్ ఫీజు చెల్లింపునకు చివరి తేదీ సెప్టెంబర్ 26.

**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్, సెప్టెంబర్ 12:**

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ (బీ.ఏ/బీ.కాం/బీ.ఎస్సీ) కోర్సులు, పీ.జీ (ఎం.ఏ/ ఎం.కాం/ ఎం.ఎస్సీ, ఎం.బీ.ఏ) కోర్సులు, డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను చివరి తేది సెప్టెంబర్ 26 వరకు పొడిగించినట్లు విశ్వవిద్యాలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం, ఆన్ లైన్ లో నమోదు తదితర అంశాలపై సందేహాలుంటే సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని లేదా విశ్వవిద్యాలయ హెల్ప్ డెస్క్ నంబర్లు: 040-23680 333 / 444 / 555, టోల్‌ఫ్రీ నెం. 18005990101 లో సంప్రదించొచ్చని సూచించారు. పూర్తి వివరాల కోసం www.braouonline.in లేదా www.braou.ac.in లో సంప్రదించాలన్నారు.

# దేశాన్ని దారిలో పెట్టాల్సిన బాధ్యత యువతదే !

ఒకప్పుడు జాతీయ రాజకీయాల్లో దక్షిణాది నేతలదే హవాగా ఉండేది. ఇప్పుడు అంతగా కనిపించడం లేదు. ముఖ్యంగా తెలుగు వారు జాతీయ రాజకీయాల్లో అరుదుగా ఉన్నారు. క్రమంగా ఒక్కొకరే కనుమరుగు అవుతున్నారు. కొత్త తరం రావాల్సి ఉన్నా రావడంలేదు. యువత రాజకీయాల్లో రాణించాల్సి ఉంది. దేశం అనేక సమస్యలు ఎదుర్కొంటున్న వేళ కొత్త తరాన్ని ఆహ్వానించాలి. రాజకీయాల్లో కూడా రిజర్వేషన్లు రావాలి. రిజర్వేషన్లు వస్తేనే పదవులు పట్టుకుని వేలాడుతున్న వారి స్థానంలో కొత్త రక్తం వస్తుంది. సర్పంచ్ నుంచి, ఎమ్మెల్యేలు, ఎంపిలకు కాలపరిమితి విధించుకోవాల్సి ఉంది. దేశం మూస పద్దతిలో నడవడం వల్లనే బంగ్లాదేశం, నేపాల్‌లో తిరుగుబాట్లు వచ్చాయి. నేపాల్‌లో యువతే ముందుకు కదిలింది. రాజకీయ స్వార్థంతో తీసుకున్న నిర్ణయాలను నిరసించడం ద్వారా దేశాన్ని కదిలించారు. దేశం ఏదైనా పదవీకాంక్షతో చేస్తున్న రాజకీయాల వల్ల ఆ దేశం పురోగమించడం లేదు. మనదేశంలోనూ ఇలాంటి సమస్యలే ఉన్నాయి. వీటిని నిలదీయాల్సి ఉంది. అందువల్ల యువతరం కొత్త ఆలోచనలతో రాజకీయాల్లో అడుగు పెట్టాల్సి ఉంది. పివి నరసింహారావు, జైపాల్ రెడ్డి, పర్వతనేని ఉపేంద్ర, సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్ రెడ్డి లాంటి నేతల మరణం తరవాత అంతగా ప్రభావితం చేయగలిగిన నేతలు రావడం లేదు. వెంకయ్యనాయుడు పదవీ విరమణ తరవాత రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. దీంతో తెలుగువారి పాత్ర అంతకంతకూ కనుమరుగు అవుతోంది. ముఖ్యంగా జాతీయ రాజకీయాల్లో తెలుగు వారి పాత్ర లేకుండా పోతోంది. పూర్వపు ఎన్‌డిఎలో చంద్రబాబు నాయుడు కన్వీనర్‌గా బాగానే రాణించారు. ఒకప్పుడు ప్రధాని, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన నేతలు ఇప్పుడు అక్కడ కనిపించడం లేదు. చక్రం తిప్పే స్థాయి నుంచి ..ఇప్పుడంతా తెరమరుగు అవుతూ వచ్చారు. గతేడాది సీతారాం ఏచూరి మరణం, మొన్నీ మధ్యనే వయోభారంతో సురవరం సుధాకర్ రెడ్డిల మరణంతో జాతీయస్థాయిలో నిలువగలిగిన నేతలు లేకుండా పోయారు. జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ఎర్రసూరీడు ఏచూరీ కూడా అస్తమించి ఏడాది కావస్తోంది. ఇంతకాలం ఓ తెలుగు నేత ఉన్నాడన్న ధీమా ఉండేది. చిమ్మ చీకటిలో మిణుమిణుకుమంటూ కనిపించే మిణుగురు పురుగులా సీతారం ఏచూరీ కనిపించేవారు. ఆయన జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఒకప్పుడు సర్వేపల్లి రాధాకృష్ణ, నీలం సంజీవరెడ్డి, పివి నరసింహారావు, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి ఉద్దండులు జాతీయ రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు. తరవాత జైపాల్ రెడ్డి, విద్యాసాగర్ రావు, వెంకయ్యనాయుడు, సురవరం సుధాకర్ రెడ్డి, సీతారాం ఏచూరిలు కనిపించేవారు. ఇప్పుడు ఒక్కోక్కరే అదృశ్యమవుతూ వచ్చారు. ఉపరాష్ట్రపతి పదవి విరమణ తరవాత వెంకయ్య నాయుడు కూడా జాతీయ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కరీంనగర్‌కు చెందిన సిహెచ్ విద్యాసాగర్ రావు కూడా గవర్నర్ పదవి తరవాత ఇంటికే పరిమితం అయ్యారు. సురవరం సుధాకర్ రెడ్డి కూడా సిపిఐ క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నాక, ఇటీవలే మరణించారు. నిజానికి కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో కొనసాగివుంటే మంచి నేతగా రాణించేవారు. ఆయన కూతురు కవితను జాతీయ రాజీయాల్లో కొనసగించినా ఆమె మంచి పట్టు సాధించేవారు. ఎందుకంటే కవిత మంచి ఇంగ్లీష్, హిందీ, ఉర్దూలలో మాట్లాడగలిగే సత్తా ఉన్న నేత. కానీ కెసిఆర్ ఎందుకనో ఆ వైపుగా ఆలోచించలేదు. ఇవాళ ఆమె ఢిల్లీ రాజకీయాల్లో ఉండివుంటే బిఆర్‌ఎస్‌కు ఇప్పుడీ దుర్గతి పట్టివుండేది కాదు. కెసిఆర్ స్వార్థ, కుటుంబ రాజకీయాల్లో పడిపోవడం వల్ల తనకున్న అవకాశాలను కోల్పోయారనే చెప్పాలి. తెలంగాణ సాధించిన తరవాత కుటుంబ రాజకీయాలను పక్కన పెట్టివుటే కెసిఆర్ అద్భుతంగా రాణించే

వారు. భాషాపటిమ, వాక్చాతుర్యం కూడా అద్భుతంగా ఉన్న నేతగా కెసిఆర్ దేశ ప్రజలకు సుపరిచితం.కుటుంబ రాజకీయాలతో ఆయన తనకున్న ఇమేజ్‌ను దెబ్బ తీసుకున్నారు. లేకుంటే జాతీయ రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగేవారు. నిబద్ద రాజకీయాలు నడపకుంటే రాణించడం కష్టం. నిజాయితీ కూడా చాలా ముఖ్యం. అది లేకుంటే ఎంతటివారైనా కాల ప్రవాహంలో కొట్టుకు పోతారు. కెసిఆర్ తనయ కవిత కూడా మంచి వక్త. ఎంపిగా ఆమె బాగా రాణించారు. కానీ లిక్కర్ స్కామ్ ఆమె రాజకీయ ప్రస్థానంపై బురద జల్లింది. ఆ మరకను చెరిపేసుకోవడం అసాధ్యం. దీంతో ఆమె కూడా ఇక రాణించడం కష్టం. జాగృతి పేరుతో ఆమె రాజకీయాలు చేస్తున్నా..తెలంగాణలో ఆ కుటుంబం మొత్తం అవినీతి పంకిలంలో మునిగిన కారణంగా వారిని నమమడం కూడా కష్టమే. మొత్తంగా ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో తెలుగువారు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. దీనిని పూడ్చాల్సిన బాధ్యత మనపైనే ఉంది. జాతీయ రాజకీయాల్లో మనపాత్ర లేకుంటే ఉత్తరాది వారి పెత్తనం సాగనుంది. ఇప్పటికే బిజెపిలో కేవలం గుజరాత్ పెత్తనమే సాగుతోంది. దేశంపై వారిద్దరే అజమాయిషీ చెలాయిస్తున్నారు. అమిత్ షాకు ఇంగ్లీష్ అంతగా వచ్చినట్లు ఎక్కడా చూడలేదు. కానీ హోంమంత్రిగా నెట్టుకు వస్తున్నారు. జాతీయ రాజకీయాల్లో రాణించాలంటే హిందీ, ఆంగ్లంపై పట్టుతో ముందుకు సాగాల్సి ఉంటుంది. అలాగే దేశ రాజకీయాలను ఔపోసన పట్టాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. వాటిపై పోరాటం చేసే సత్తా ఉండాలి. అప్పుడే రాణించగలరు. తెలుగుదేశం నుంచి కేంద్ర విమానాయన మంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్మోహన్ నాయుడు కొంత లోటు పూడ్చే అవకాశాలు లేకపోలేదు. అయితే పార్టీ ఆయనకు పూర్తి స్వేచ్చను ఇచ్చినప్పుడే ఇది సాధ్యం. ఎందుకంటే రామ్మోహన్ నాయుడు కూడా బాగా చదువుకున్న వాడే కాకుండా యువకుడు. చంద్రబాబు ఆయనకు బాగానే ప్రోత్సాహం ఇస్తున్నారు. ఇంగ్లీష్, హిందీలపై బాగా పట్టు సాధించారు. సమస్యలపై అవగాహన ఉంది.

# మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వ్యాఖ్యలు సరికావు.

**పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారు.**

**పోలీస్ వ్యవస్థ ఏ పార్టీకి పక్షపాతం కాదు..**

**పద్ధతి మార్చుకోకపోతే చట్టపరంగా చర్యలు.**

**పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ.షకీల్ పాషా..**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వ్యాఖ్యలు సరికావు అని, పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ.షకీల్ పాషా అన్నారు. పోలీస్ వ్యవస్థ ఏ పార్టీకి పక్షపాతం కాదనీ, మాజీ ఎమ్మెల్యే అసత్య ఆరోపణల పద్ధతి మార్చుకోకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం నిజామాబాద్ సీపీ కార్యాలయంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఆర్మూర్ లో గణేష్ నిమజ్జన సమయంలో పోలీస్ శాఖపై మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అనుచితంగా మాట్లాడడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన అన్నారు. గత కొన్ని రోజులుగా వార్తాపత్రికల్లో, సోషల్ మీడియాలో పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వ్యవహరించడం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫేస్బుక్ లైవ్ ద్వారా స్థానిక ఎస్హెచ్ఓ ను హోటల్ ఎందుకు బంద్ చేస్తున్నారని, పింకు బుక్కు యందు మీ పేరు ఎక్కిస్తానని తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీ సంగతి చూస్తానని మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సదరు ఎస్హెచ్ఓ కు బెదిరించడం జరిగిందని ఆయన తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా రాత్రి సుమారు 10 గంటల సమయంలో అన్ని ఎస్టాబ్లిష్మెంట్ లు బంద్ చేస్తున్నామని, అందులో భాగంగానే హోటల్ బంద్ చేయడం జరిగిందని అన్నారు. పోలీసులు చట్టపరంగా ఎలాంటి పక్షపాతం లేకుండా అన్ని ఎస్టాబ్లిష్మెంట్లను బంద్ చేయడం జరుగుతుందన్నారు. కానీ ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతీసే విధంగా తమ విధులను నీరు కార్చే విధంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 8వ తేదీ వరకు వినాయక విగ్రహ చవితి ప్రతిష్టాపన నుండి నిమజ్జనం వరకు పోలీసులు విధి నిర్వహణలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎలాంటి చిన్న సంఘటనలు జరగకుండా రాత్రింబవళ్లు చూసుకోవడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం డీజే, ఐ వాల్యూమ్ స్పీకర్లు నిషేధించడం జరిగిందని, తమ ఆంక్షలు అతిక్రమించి ఇష్టానుసారంగా వ్యవహరించడం పట్లనే అక్కడ ఉన్న సంబంధిత వ్యక్తిపై కేసులు నమోదు చేయడం జరిగిందని అన్నారు. అది కూడా విధి నిర్వహణలో భాగంగానే కానీ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పోలీసులను టార్గెట్ చేస్తూ మా వారిపై తప్పుడు కేసులు పెట్టడం జరిగిందని ప్రచారం చేస్తున్నారనీ, దీనివల్ల మా పోలీసుల మనోధైర్యం దెబ్బతిసే విధంగా వ్యాఖ్యలు

ఉన్నాయని అన్నారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన జీవన్ రెడ్డి పోలీసులపై కనీస మర్యాద లేకుండా తమ మనో ధైర్యాన్ని దెబ్బతీసే విధంగా చేసిన వ్యాఖ్యలపై పోలీసు అధికారుల సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని వెల్లడించారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు

చేయకూడదని పోలీస్ సంఘం తరఫున ఆయనకు విన్నవించడం జరుగుతుందన్నారు. ఒకవేళ మళ్లీ ఇదేవిధంగా వ్యాఖ్యలు చేస్తే పోలీస్ సంఘం తరఫున చట్ట ప్రకారంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో తెలంగాణ స్టేట్ పోలీస్ ఆఫీసర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజన్న, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గోవర్ధన్ రెడ్డి, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రియుడితో కలిసి కన్న కూతురినే చంపిన కసాయి తల్లి.

## - పోలీసుల విచారణతో బహిర్గతం.

**వేగుచుక్క న్యూస్, మెదక్:**

ప్రియుడితో కలిసి కన్న కూతురినే చంపిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని శభాష్ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శభాష్ పల్లి గ్రామానికి చెందిన మమతకు ఏడు సంవత్సరాల క్రితం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం దొడ్లపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ తో వివాహం జరిగింది. మమతకు ఒక బాబు, ఒక పాప ఉన్నారు. పాపా తనుశ్రీ (2) సంవత్సరాలు. అయితే తల్లి గారి గ్రామమైన శభాష్ పల్లికి మమత వస్తుండేది. ఈ క్రమంలోనే శభాష్ పల్లి చెందిన ఫయాజ్



తో పరిచయం ఏర్పడి అక్రమ సంబంధంకు దారి తీసింది. గత సంవత్సరం నుంచి వీరు ఇద్దరు అక్రమ సంబంధం ఏర్పరుచుకొని

సంవత్సరంలో రెండు సార్లు వేరే ప్రాంతంకు వెళ్ళిపోయారు. గత నాలుగు నెలల క్రితం మమత కుటుంబ సభ్యులు మిస్సింగ్ పై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసును చేదించే ప్రయత్నం చేస్తుండడంతో వీరిద్దరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నరసరావుపేట వద్ద దొరికారు. పోలీసులు విచారించి మమత కూతురు తనుశ్రీ గురించి అడగగా.. తామే చంపి శభాష్ పల్లి గ్రామ శివారులోని కొత్త కుంట వద్ద పాతి పెట్టామని చెప్పడంతో శుక్రవారం పోలీసులు, ఫోరెన్సిక్ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి పాతిపెట్టిన శవాన్ని వెలికి తీసి పంచనామా చేపట్టారు.

# మదరాసికి రజనీకాంత్ ప్రశంసలు..



శివకార్తికేయన్ నటించిన 'మదరాసి' చిత్రం బాక్సాఫీస్ దగ్గర మంచి విజయం సాధించింది. ఏఆర్ మురగదాస్ డైరెక్ట్ చేసిన ఈ సినిమాపై పలువురు సినీ ప్రముఖులు పోస్టులు పెట్టారు. తాజాగా కోలీవుడ్ సీనియర్ హీరో సూపర్ స్టార్ రజనీకాంత్ ఈ సినిమా చూసి శివకార్తికేయన్‌పై ప్రశంసలు కురిపించారు. ఆయన నటనను, యాక్షన్ సన్నివేశాలను రజనీకాంత్ మెచ్చుకున్నారు. అంతేకాకుండా శివ కార్తికేయన్ యాక్షన్ హీరోగా ఎదుగుతాడని రజనీకాంత్ ఆశీర్వదించారు. తన అభిమాన హీరో నుండి ప్రశంసలు రావడంతో శివకార్తికేయన్ సంతోషం వ్యక్తం చేశారు.

గతేడాది 'అమరన్' సినిమాతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్టు అందుకుందుకున్న తమిళ హీరో శివకార్తికేయన్.. ఇప్పుడు లేటెస్టుగా 'మదరాసి' మూవీతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఎఆర్. మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ హై-ఆక్టేన్ యాక్షన్ ఎంటర్టైనర్ ఇటీవలే తెలుగు తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. పాజిటివ్ టాక్ తో నడుస్తోంది. తాజాగా సూపర్ స్టార్ రజనీకాంత్ ఈ సినిమా చూసి చిత్ర బృందాన్ని అభినందించారు. శివకార్తికేయన్‌పై ప్రశంసలు కురిపించారు. రజనీకాంత్ 'మదరాసి' సినిమా చూశారనే విషయాన్ని శివకార్తికేయన్ సోషల్ మీడియాలో వెల్లడించారు. తాను దైవంగా భావించే తలైవా నుంచి ప్రశంసలు రావడం ఎంతో ఆనందంగా అందరూ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. "నా ఆరాధ్య దైవం, నా తలైవర్ సూపర్‌స్టార్ రజనీకాంత్ సార్ నుండి ఇప్పుడే 'మదరాసి'కి ప్రశంసలు అందుకున్నాను. "మై గాడ్, ఎక్సలెంట్. ఏమి పర్ఫార్మెన్స్. ఏమి యాక్షన్. సూపర్ సూపర్ శివ కార్తికేయన్. నాకు సినిమా చాలా బాగా నచ్చింది. నువ్వు యాక్షన్ హీరో అయిపోతావు. దేవుడు నిన్ను ఆశీర్వదిస్తాడు" అంటూ ఆయన ట్రేడ్‌మార్క్ నవ్వుతో పాటు నా తలైవర్ నుంచి హృదయపూర్వక శుభాకాంక్షలు వచ్చాయి. లవ్ యు తలైవా" అని శివ కార్తికేయన్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.గతంలో పలు సందర్భాల్లో ఆయనపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. రజినీ సైతం శివ కార్తికేయన్ సినిమాలు చూసినప్పుడు ఇంటికి పిలిచి మరీ అభినందించారు. 'కూలీ' షూటింగ్ జరుగుతున్నప్పుడు శివకార్తికేయన్ సెట్స్ కి వెళ్లి రజనీకాంత్ ను కలిసి కాసేపు మాట్లాడి వచ్చారు. ఇప్పుడు మదరాసి సినిమాకి తాను ఎంతో ఆరాధించే హీరో నుంచి ప్రశంసలు దక్కడంతో శివ ఖుషీ అవుతున్నారు.

# సెట్స్‌లో మా అమ్మను చూసి నాన్న స్టెప్పులు మర్చిపోయారు



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ హీరో హీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహించిన ఈ హారర్ థ్రిల్లర్ ను షైన్ స్క్రీన్ బ్యానర్ పై సాహు గారపాటి నిర్మించారు. ఇప్పటికే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం.. శుక్రవారం(సెప్టెంబర్ 12) ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ప్రచారంలో చివరి అంకమైన ప్రీ రిలీజ్ ఈవెంట్ ను బుధవారం సాయంత్రం హైదరాబాద్ లో నిర్వహించారు. దీనికి దర్శకులు అనిల్ రావిపూడి, బుచ్చిబాబు, చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా తన తండ్రి చిరంజీవికి అమ్మ సురేఖ అంటే కాస్త భయమని సుస్మిత నవ్వుతూ చెప్పింది. దీనికి ఉదాహరణగా ఓ సరదా ఇన్సిడెంట్ ను పంచుకున్నారు. "మన శంకర వరప్రసాద్ గారు' సెట్స్ లో ఇవాళ ఓ చిన్న విషయం జరిగింది. ప్రస్తుతం ఓ సాంగ్ షూటింగ్ జరుగుతోంది. మా అమ్మ స్పెషల్ గా షూట్ కి వచ్చారు. అప్పటిదాకా నాన్న చాలా బాగా డ్యాన్స్ చేస్తున్నారు. సడన్ గా ఆమె వచ్చి ఎదురుగా కూర్చోవడం వల్ల డ్యాన్స్ కొంచం అటు ఇటు అవ్వడం, స్టెప్పులు మర్చిపోవడం వంటివి జరిగాయి. ఆయనపై అమ్మ ఎఫెక్ట్ పడిందని అనుకుంటున్నాను" అని సరదాగా చెప్పారు. దీంతో ఎంత మెగాస్టార్ అయినా భార్య అంటే భయపడాల్సిందే అంటూ ఫ్యాన్స్ ఫన్నీ కామెంట్స్ చేశారు. (భారీ రేటుకి 'అఖండ 2' ఓటీటీ రైట్స్.. బాలయ్య క్రేజ్ నెక్స్ట్ లెవల్ అంతే..)

తన మోస్ట్ ఫేవరెట్ జానర్ హారర్ థ్రిల్లర్ అని, 'కిష్కింధపురి' తప్పకుండా విజయం సాధించాలని సుస్మిత కోరుకున్నారు. "ట్రైలర్ మైండ్ బ్లోయింగ్ గా, ఫెంటాస్టిక్ గా ఉంది. డైరెక్టర్ కౌశిక్ ఇంటెన్స్ విజువల్స్ చూపించారు. హ్యూమర్ టచ్ ఇస్తూ చాలా ఇంట్రెస్టింగ్ ప్రజెంట్ చేశారు. కిష్కింధపురి అనే టైటిల్ తోనే అందర్నీ ఒక సూపర్ నాచురల్ వరల్డ్ లోకి ఈజీగా తీసుకెళ్ళిపోయారు. సాయి శ్రీనివాస్, అనుపమ బెస్ట్ పర్ఫార్మన్స్ ఇచ్చారు. అనుపమ చాలా మందిని భయపెట్టింది. శ్రీనివాస్ సూపర్ నాచురల్ పవర్స్ లేకుండానే భయపెట్టేశాడు. విజువల్స్, మ్యూజిక్ పెంటాస్టిక్ గా ఉన్నాయి. నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. షైన్ స్క్రీన్ నుంచి ఏ సినిమా వచ్చినా ప్రొడక్షన్ వాల్యూస్ అద్భుతంగా ఉంటాయి" అని సుస్మిత చెప్పుకొచ్చారు.

# ఆడియన్స్.. పిచ్చోళ్లా మీరు?



మౌళి తనూజ్, శివానీ నాగారం హీరోహీరోయిన్లుగా సాయి మార్తాండ్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'లిటిల్ హార్ట్స్'. ఈటీవీ విన్ ప్రొడక్షన్ లో రూపొందిన ఈ చిత్రాన్ని బన్నీ వాసు, వంశీ నందిపాటి థియేట్రికల్ రిలీజ్ చేశారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రానికి ఆడియన్స్ నుంచి ఊహించని రెస్పాన్స్ వస్తోంది. ముఖ్యంగా యూత్ కి ఈ సినిమా బాగా కనెక్ట్ అయింది. బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లను రాబడుతూ దూసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం గురువారం థ్యాంక్స్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరో హీరోయిన్లు, దర్శక నిర్మాతలు పాల్గొన్నారు. హీరో మౌళి తనూజ్ మాట్లాడుతూ.. "లిటిల్ హార్ట్స్ సినిమా కోసం టీమంతా ఎంతో కష్టపడ్డారు. ప్రతి ఒక్కరు 100% ఎఫర్ట్ పెట్టారు. అందరికీ థాంక్యూ థాంక్యూ సో మచ్. ఆడియన్స్.. పిచ్చోలా మీరు?. ఒక మంచి సినిమా వస్తే ఇంతగా సపోర్ట్ చేస్తారా?. మేము అసలు ఎక్స్పెక్ట్ చేయలేదు. మంచి సినిమా చేసామని తెలుసు. ఫస్ట్ వీక్ లో కొంతమంది వస్తారు.. టాక్ స్ప్రెడ్ అయితే ఆ నెక్స్ట్ వీక్ ఆడుతుంది అనుకున్నాం. దానికే మేం ప్రిపేర్ అయ్యాం. జనాల వరకూ తీసుకెళ్లడానికి ఫుల్ ఎఫర్ట్స్ పెట్టి ప్రమోషన్స్ చేశాం. ఓటీటీలలో సినిమాలు చేసే ప్రేక్షకులను థియేటర్ కి రప్పించడం అంటే కష్టం. అందుకే అసలు వస్తారా లేదా? అని డౌట్ ఉండేది. థియేటర్లకి రప్పించగలమా? అని భయమేసింది. కానీ ప్రీమియర్స్, ఫస్ట్ రోజు ఫుల్స్ పడ్డాయి" అని చెప్పాడు. "ఇండస్ట్రీ నుంచి పెద్ద పెద్ద వాళ్ళు అందరూ కాల్స్ చేస్తున్నారు.. ట్వీట్లు వేస్తున్నారు. బండ్ల గణేష్ అన్న కాల్ చేసి 'అమ్మా.. మౌలీ చితకమింగావ్' అన్నాడు. రవితేజ గారు కాల్ చేశారు. 'నా చిన్నప్పుడు నేను చేసిన సినిమాలాగే ఉంది. చాలా అంటే చాలా బాగా చేసావ్' అని చెప్పారు. నా ఫేవరెట్ హీరో నాని ట్వీట్ వేశారు. ఆయన ట్వీట్ చేస్తే నేను ఎక్కడో గాలిలో ఉన్నాను. ఇంకా దిగలేదు.. నేను ఇంకా గాలిలోనే ఉన్నాను. ఈ వారం అంతా గాలిలోనే ఉంటాను. నేను కిందకి దిగను. ఈ మూమెంట్ ఎంజాయ్ చేస్తున్నాను. 100% ఎంజాయ్ చేస్తున్నాను.. దాన్ని ఎవ్వడూ ఆపలేడు. థాంక్యూ సో మచ్ ఆడియన్స్. నేను ఇలాగే కష్టపడతా మంచి స్క్రిప్ట్స్ తోనే వస్తా.. మంచి మంచి సినిమాలతోనే వస్తా. మీరు నమ్మి థియేటర్ కి రండి. కచ్చితంగా ఎంటర్టైన్ చేస్తా. మీ రూపాయికి పది రూపాయలు కంటెంట్ తీసుకొస్తా. ప్రొడ్యూసర్లు రూపాయి పెడితే 10 రూపాయలు వచ్చేలాగా పని చేస్తా" అని మౌళి అన్నాడు.

# ఇద్దరు ముద్దుగుమ్మలతో సిద్ధు జొన్నలగడ్డ



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నీరజ కోన దర్శకత్వంలో 'తెలుసు కదా' చిత్రం తెరకెక్కుతోంది. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. థమన్ సంగీతం అందించిన ఈ చిత్రం అక్టోబర్ 17న విడుదల కానుంది. తాజాగా విడుదలైన టీజర్ ఆకట్టుకుంటోంది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన ఈ చిత్రంతో డైరెక్టర్ గా పరిచయం కాబోతున్నారు. ఇందులో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు.ప్రమోషన్స్ లో భాగంగా మేకర్స్ ఇదివరకే రరిలీజ్ చేసిన 'మల్లికా గంధ' మ్యూజికల్ వీడియోకి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా టీజర్ యూ విడుదల చేశారు. ఇవాళ సెప్టెంబర్ 11వ తేదీ ఉదయం 11 గంటల 11 నిమిషాలకు 'తెలుసు కదా' టీజర్ ను లాంచ్ చేశారు. "ప్రేమ ఇంత గందరగోళంగా, ఇంత వినోదాత్మకంగా ఎప్పుడూ లేదు" అంటూ చిత్ర బృందం విడుదల చేసిన ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. ఇందులో సిద్దూ హీరోయిన్లని లవ్ చేస్తూ కనిపించారు. టిల్లుగాడి స్టైల్ లో చెప్పిన డైలాగ్స్ అలరిస్తున్నాయి. ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం సమకూర్చారు. అక్టోబర్ 17న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# కట్టె కాలే వరకూ చిరంజీవి అభిమానినే..

మెగాస్టార్ చిరంజీవి, నయనతార కలిసి నటిస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ కూడా కనిపించనున్నారు. అయితే ఈ సినిమాలో చిరంజీవి గారికి కొరియోగ్రఫీ చేసే అవకాశం పొందిన కొరియోగ్రాఫర్ విజయ్ తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తన కల నెరవేరినందుకు ఆయన ఆనందానికి అవధుల్లేవని ఈ పోస్ట్ చూస్తే అర్థమవుతోంది. చిరంజీవి పాటకు కొరియోగ్రఫీ చేయాలని ప్రతి డ్యాన్సర్‌కు ఉంటుందని, 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో తన చిన్ననాటి కల నెరవేరిందని పొలాకి విజయ్ అన్నారు. "చిన్నప్పటి కల.. ఎవరి డ్యాన్స్ చూసి పెరిగానో.. ఎవరి డ్యాన్స్ చూసి డ్యాన్స్ మీద ఇష్టం కలిగిందో.. ఎవరి డ్యాన్స్ చూసి నేను ఇండస్ట్రీకి వెళ్లాలి అని అనుకున్నానో.. ఎవరి డ్యాన్స్ చూసి నాకు ఆయనతో ఒక ఛాన్స్ వస్తుందా? అని ఫీలయ్యానో.. అలాంటి గాడ్ ఆఫ్ డ్యాన్స్ అయిన వన్ అండ్ ఓన్లీ మెగాస్టార్ చిరంజీవి



గారికి నేను కొరియోగ్రఫీ చేసే అవకాశం రావడం నాకు దేవుడిచ్చిన పెద్ద గిఫ్ట్. 2025 నా జీవితంలో ఒక బిగ్గెస్ట్ ఇయర్ అనుకుంటున్నా" "ఈరోజు మా బాస్‌తో పనిచేసే అవకాశం రావడానికి కారణం అనిల్ రావిపూడి సర్, సుస్మిత గారు, సాహు గారు. మీ సపోర్ట్ కి థ్యాంక్స్. ఇది నాకు ఎప్పటికీ మర్చిపోలేని గిఫ్ట్. మీకెప్పటికీ కృతజ్ఞతతో ఉంటాను. సమీర్ సర్ సపోర్ట్ కి ధన్యవాదాలు. బాస్‌తో వర్క్ చేయాలనేది ప్రతి ఒక్క డ్యాన్సర్ డ్రీమ్. నాకైతే ఇంకా స్పెషల్. ఎందుకంటే నాకు ఇష్టమైన హీరో.. మా అమ్మానాన్నలకు కూడా ఇష్టమైన హీరో మెగాస్టారా చిరంజీవి. వారిద్దరి ఆశీస్సులు ఉండటం వల్ల నేను ఈరోజు ఆయన దాకా చేరుకున్నానని భావిస్తున్నా. థ్యాంక్యూ సో మచ్ చిరంజీవి సార్. ఐ లవ్ యూ ఫరెవర్. ఈ కట్టె కాలే వరకూ మీ ఫ్యాన్‌నే" అని విజయ్ తన పోస్టులో రాసుకొచ్చారు.

# రెండు బిగ్ సర్‌ప్రైజ్‌లు



'మిరాయ్' సినిమాలో తన పాత్ర గురించి తేజ మాట్లాడుతూ.. "ఒక మామూలు కుర్రాడు తన ధర్మాన్ని తెలుసుకొని, తనకి యోధులకి ఉన్న అనుబంధాన్ని తెలుసుకుని, ఒక పెద్ద ఆపదని ఆపడానికి ఎంత దూరం వెళ్తాడు? తన తల్లి ఆశయం కోసం ఎంత దూరం వెళ్తాడు? ఇతిహాసాల్లో ఉన్న సమాధానం కోసం జర్నీ చేసే క్యారెక్టర్ లో కనిపిస్తా" అని చెప్పాడు. "మన ఇతిహాసాలతో చాలా ఆర్గానిక్ గా బ్లెండ్ అయిన కథ ఇది. బలవంతంగా ఇరికించింది కాదు. శ్రీరాముడికి సంబంధించి చిన్న పోర్షన్ ఉన్నప్పటికీ, అది చాలా స్ట్రాంగ్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది. అలాగే ఈ సినిమాలో రెండు సర్ ప్రైజ్ లు ఉన్నాయి. అవేంటనేది రేపు ఆడియన్స్ చూడబోతున్నారు" అని అన్నాడు.

"మిరాయ్ క్లీన్ ఫ్యామిలీ ఫిలిం. స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు యాక్షన్ అడ్వెంచర్, ఫాంటసీ, ఎమోషన్, డివోషనల్, ఎలివేషన్.. ఇలా అన్నీ ఉంటాయి. ఇది అందరికీ నచ్చే సినిమా. ముఖ్యంగా పిల్లల్ని ఎక్కువగా ఆకట్టుకునే సినిమా అవుతుంది. ఆడిటోరియం ఎక్స్పీరియన్స్ ఉన్న ఫిలిం. థియేటర్స్ లో ఎక్స్ట్రార్డినరీ ఎక్స్పీరియన్స్ ఇస్తుంది. ఒక ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ సినిమా ఇవ్వాలని ఉద్దేశంతో వర్క్ చేశాం. దాన్ని ఎచీవ్ చేశామని భావిస్తున్నాం. ప్రేక్షకులందరూ అదే ప్రేమతో మమ్మల్ని ఆదరిస్తారని కోరుకుంటున్నాను" అని తేజ అన్నాడు. సినిమాలో మొత్తం 9 యాక్షన్ బ్లాక్స్ ఉన్నాయని, ప్రతి యాక్షన్ సీక్వెన్స్ దేనికదే ఛాలెంజింగ్ గా అనిపించిందని పేర్కొన్నాడు. శ్రియ, జగపతిబాబులతో తాను చిన్నప్పుడు కలిసి నటించానని, వారితో మళ్ళీ ఇప్పుడు 'మిరాయ్'లో కలిసి పని చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చిందని తేజ సజ్జా అన్నాడు. "జగపతిబాబు, జయరాం లాంటి పెద్ద స్టార్స్ ఈ సినిమా మీద ప్యాషన్ తో చాలా బిజీగా ఉన్నప్పటికీ, మేమంతా కష్టపడుతుంటే వాళ్ళు అంతే కష్టపడ్డారు. మాతో పాటు హిమాలయాలు, నేపాల్, శ్రీలంక వచ్చారు. మైనస్ 80 డిగ్రీస్ వాతావరణంలో కూడా వర్క్ చేశారు. ఈ సినిమా కోసం అంత హార్డ్ వర్క్ చేసినందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు" "మంచు మనోజ్ క్యారెక్టర్ చాలా పవర్ ఫుల్ గా ఉంటుంది. ఒక జీవితాన్ని చూసి వచ్చిన పాత్ర. ఆ పాత్రకి ఒక ఫిలాసఫీ ఉంటుంది. ఒక పెద్ద దేంజర్ క్రియేట్ చేయగల క్యారెక్టర్. హీరో ఎలా ఎదుర్కోగలడు? అనిపించేలా ఉండే క్యారెక్టర్. టీజీ విశ్వప్రసాద్ లాంటి ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్స్ ని చాలా అరుదుగా కలుస్తాం. ఎక్స్ట్రాడినరీ సినిమా చేద్దామని బిగినింగ్ నుంచి ప్రతి అడుగులో సపోర్ట్ చేశారు. చాలా ఫ్రీడం ఇచ్చి సపోర్ట్ చేశారు. ఆయన అంత స్వేచ్ఛ ఇవ్వడం వల్ల మాకు ఇంకా బాధ్యత పెరిగింది. హరి గౌర ఎక్స్ట్రాడినరీ మ్యూజిక్ ఇచ్చాడు" అని తేజ సజ్జా తెలిపాడు.

# ఓటీటీలోకి



తలైవర్ రజనీకాంత్ నటించిన 'కూలీ' చిత్రం నెల రోజుల్లోనే ఓటీటీలోకి వచ్చేసింది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో నాగార్జున విలన్ గా నటించిన ఈ చిత్రం.. అమెజాన్ ప్రైమ్ వీడియోలో నాలుగు భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఆగస్టు 14న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లను రాబట్టింది. మిక్స్డ్ టాక్ వచ్చినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. అయితే ఇప్పుడు ఈ సినిమా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా 'కూలీ' మూవీ స్ట్రీమింగ్ అవుతోంది. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ చేయబడింది. ఇప్పటి వరకూ చిన్న మీడియం రేంజ్ సినిమాలు మాత్రమే నెల రోజుల్లో డిజిటల్ ఫ్లాట్ ఫామ్స్ లోకి వస్తున్నారు. రజనీకాంత్ లాంటి స్టార్ హీరో నటించిన సినిమా కూడా నెల రోజుల్లోనే ఓటీటీలోకి రావడం గమనార్హం.

# ఎన్టీఆర్ స్టైల్‌లో కాలర్ ఎగరేసిన బెల్లంకొండ..



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ నటించిన 'కిష్కింధపురి' చిత్రం విడుదలకి సిద్ధంగా ఉంది. ప్రీ రిలీజ్ ఈవెంట్లో సాయి శ్రీనివాస్ సినిమాపై నమ్మకంగా మాట్లాడారు. ఇది ఒక కొత్త తరహా హారర్ థ్రిల్లర్ అని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుందని అన్నారు. సినిమా చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ భయపడతారని, దర్శకుడు కౌశిక్ గొప్ప స్థాయికి వెళ్తారని ఆయన పేర్కొన్నారు. ఫోన్ పక్కన పెట్టి సినిమా చూడమని సాయి శ్రీనివాస్ ప్రేక్షకులను కోరారు. హీరో సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ.. "మేము ఎంతో కష్టపడి 'కిష్కింధపురి' సినిమా చేశాం. చాలా ప్యాషనేట్ గా ఒక కొత్త జానర్ లో మన తెలుగు ఆడియన్స్ కి ఒక కొత్త ఎక్స్పీరియన్స్ ఇవ్వాలనుకున్నాం. దానికి అనిల్ రావిపూడి, బుచ్చిబాబు, సుస్మిత వచ్చి సపోర్ట్ చేయడం ఆనందంగా ఉంది. ఒక మంచి పాయింట్ ని కమర్షియల్ సినిమా ద్వారా ఇంపాక్ట్ ఫుల్ గా చెప్తే దాని రీచ్ వేరు. 'పెద్ది' సినిమాలో ఒక షాట్ పెట్టారు. ఆ ఒక్క షాట్ తో నాకు తెలిసి లక్షల టికెట్లు తెగుతాయి. సినిమా చాలా చాలా పెద్ద హిట్ అయి, నిర్మాత సతీష్ కి మంచి పేరు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అని అన్నారు. "కిష్కింధపురి సినిమా సెప్టెంబర్ 12న వస్తుంది. భయ్యా.. భయపడటం కూడా ఒక ఆర్ట్. ఈ సినిమాతో అందర్నీ భయపెడతాం. మంచి విజువల్స్, సౌండ్స్, మంచి కథ చూశామనే సంతృప్తి ప్రేక్షకులకు ఉంటుంది. మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ ఇరగదీసాడు భయ్యా. బద్దలు కొట్టేయబోతున్నారు. ఫస్ట్ నుంచి ఎండ్ ఫ్రేమ్ వరకు రెండు గంటలు హుక్ అయిపోయి చూస్తారు. నేను ఈ మధ్య ఇచ్చిన స్టేట్మెంట్ చాలా వైరల్ అవుతుంది. '10 నిమిషాల తర్వాత మీరు ఫోన్ పట్టుకుంటే నేను ఫిలిం ఇండస్ట్రీ వదిలేస్తాను' అని అన్నాను. బతకాలనుకుంటుంది ఇక్కడే.. కట్టే కాలే వరకు తెలుగు ఫిలిం ఇండస్ట్రీనే నా లైఫ్. నాకు అర్థం కాని లాజిక్ ఏంటంటే అసలు సినిమా థియేటర్ కి ఫోన్ ఎందుకు?. హ్యాపీగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకొని జేబులో పెట్టుకొని సినిమా చూడండి"